ఇంజినీరింగ్, ఫార్మసీ ఫీజులు పెంచొద్దు

కేపీహెచ్‌బీకాలనీ: ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ఫీజులను పెంచొద్దని టీఏఎఫ్‌ఆర్సీ చైర్మన్ జస్టిస్ గోపాల్ రెడ్డికి బుధవారం జేఎన్‌టీయూహెచ్ స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు రాహుల్ నాయక్, శివకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఇంజినీరింగ్, ఫార్మసీ విద్య పేదలు చదివే పరిస్థితి లేదన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ప్రభుత్వం నిర్ణయించే లక్షల రూపాయల ఫీజులను చెల్లించలేక విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల పెంపు విషయంలో పునరాలోచన చేయాలని కోరారు. కార్యక్రమంలో జల్లెడ బ్రహ్మం, పూల అరవింద్, నితిన్, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్‌ఆర్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న అధికార ప్రతినిధులు శ్యామల, వెంకట్‌రెడ్డి తదితరులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి బాలాజీనగర్‌లో వైఎస్‌ఆర్‌సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఐస్‌క్రీమ్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ అధికార ప్రతినిధులు శ్యామల, కారుమూరు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి అనంతరం కేక్ కట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వైఎస్‌ఆర్‌సీపీ మొదటి నుంచి సింగిల్‌గానే పోటీ చేసిందన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి గెలిచే వ్యక్తిత్వం జగన్‌మోహన్ రెడ్డిది కాదన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని సాయినగర్ వెస్ట్‌లో ఎర్ర పోచమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, రాజేష్ చంద్ర, శ్రీనివాస్, సంతోష్ బిరాదర్, ఉమేష్, రామరాజు, రాము, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి

కూకట్‌పల్లి: తెలంగాణ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాఘవేంద్ర, నగర కార్యదర్శి ధనుంజయ్ డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అరకొర నిధులను విద్యారంగానికి కేటాయించి ఉద్దేశపూర్వకంగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలను నిర్వీర్యం చేస్తుందన్నారు. ప్రభుత్వంలో మార్పు రాకుంటే రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు.

కంటి చూపు కోల్పోతున్నానని వ్యక్తి ఆత్మహత్య

బాలానగర్: కంటి చూపును కోల్పోయినందుకు ఓ వ్యక్తి మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. బాలానగర్ సీఐ నరసింహరాజు వివరాల ప్రకారం.. రాజు కాలనీలో కేశవరావు (65) తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. 25 సంవత్సరాల క్రితం కేశవరావుకు ఓ ప్రమాదం జరిగి కంటికి దెబ్బ తగిలింది. అప్పుడు వైద్య చేయించుకున్నాడు. అయితే కొద్ది రోజులుగా కంటి చూపు మందగించటంతో ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోగా.. కంటి చూపును క్రమంగా కోల్పోతారని డాక్టర్ తెలిపారు. అంతేకాకుండా మరో కన్నుకి ఆ కంటి నుంచి ఇన్‌ఫెక్షన్ సోకిందని కూడా తెలియజేశారు. దీంతో కేశవరావు బుధవారం తన ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బయటకు వెళ్లి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా!

కబ్జా కోరల్లో కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు భూములు | సవాలుగా మారిన భూముల సంరక్షణ | నష్టపరిహారం తీసుకున్న వారు సైతం కబ్జాకు యత్నం


కాంక్రీట్ జంగిల్‌గా మారిన కూకట్‌పల్లి ప్రాంతంలో ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు పాగ వేసేందుకు కబ్జాదారులు యత్నిస్తున్నారు. ఇక ప్రభుత్వానికి చెందిన స్థలం అయితే అడ్డు అనేదే లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇదే కోవలో కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థకు చెందిన వందలాది ఎకరాల పరిస్థితి. ఎప్పుడు ఎవరు ఎక్కడ కబ్జా చేస్తున్నారో తెలియని పరిస్థితి. గతంలో హౌసింగ్ బోర్డు భూముల జోలికి వెళ్లాలంటేనే భయపడేవారు. కానీ మారిన పరిస్థితుల నేపథ్యంలో హౌసింగ్ బోర్డును ఆనుకొని ఉన్న ఇళ్ల యజమానులు మొదలుకొని నాటి కాలంలో హౌసింగ్ బోర్డుకు భూములను అప్పగించి పరిహారం తీసుకున్న వారు కూడా తిరిగి ఖాళీ స్థలాలను ఏదో విధంగా స్వాధీనంలోకి తీసుకునేందుకు యత్నిస్తున్నారు.

– కేపీహెచ్‌బీకాలనీ



కైత్లాపూర్‌వద్ద హౌసింగ్ బోర్డు ఖాళీ స్థలాలకు ఏర్పాటు చేసిన ప్రహరీ

వేల కోట్లు విలువ చేసే భూములు..



ఆసియాలోనే అతి పెద్ద కాలనీగా రూపాంతరం చెందిన హౌసింగ్ బోర్డు కాలనీలో ఖాళీ స్థలం గజానికి కనీస ధర రూ.1.50 లక్షలు. గరిష్ఠంగా గజం ధర రూ. 2 లక్షల వరకు ఉంది. ఇటీవల ఏ మాత్రం వాస్తు ప్రకారం లేని కనీసం సరైన గృహ నిర్మాణ అనుమతులు కూడా లభించని వంద, రెండు వందల గజాల లోపు స్ట్రే పీసెస్ స్థలాలకు బహిరంగ వేలం నిర్వహించారు. వాటిని కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున డిమాండ్ ఏర్పడింది. అత్యధికంగా గజం రూ.1.80 లక్షల ధర పలికింది. చివరకు పలువురు కోర్టును ఆశ్రయించగా.. వేలం ద్వారా ప్లాట్లను కొనుగోలు చేసినా చివరకు ఎటూ తేలకుండా నిలిచిపోయాయి. ఇప్పటికీ హౌసింగ్ బోర్డు సంస్థకు, డెక్కన్ ఇన్ఫ్రా లిమిటెడ్ (దిల్) సంస్థకు ఎలాంటి లే అవుట్ చేయనివి, ఎవరికి అమ్మని స్థలాలు కూకట్‌పల్లి ప్రాంతంలోనే వంద ఎకరాలకు పైగా ఉన్నాయి. వేల కోట్ల రూపాయల విలువ చేసే భూములను సంరక్షించుకోవడానికి ప్రభుత్వ పరంగా పటిష్టమైన చర్యలు తీసుకోకపోవడంతో ఎవరికి వారు ఖాళీ స్థలాలను కబ్జా చేస్తున్నారు.

కైత్లాపూర్ కేంద్రంగా...

కూకట్‌పల్లి, మూసాపేట గ్రామాలకు నడుమ ఉన్న కుగ్రామం కైత్లాపూర్. ఇదే గ్రామానికి ఆనుకొని హౌసింగ్ బోర్డుకు చెందిన సుమారు 30 ఎకరాల ఖాళీ స్థలం ఉంది. ఆ ఖాళీ స్థలాన్ని కబ్జా చేసేందుకు పదేళ్లుగా పలువురు ప్రయత్నిస్తున్నారు. కొందరు తమ భూములను హౌసింగ్ బోర్డుకు అప్పగించలేదని కోర్టులను సైతం ఆశ్రయించారు. మరి కొందరు హౌసింగ్ బోర్డు స్థలాలకు ఉన్న ఫెన్సింగ్‌ను తొలగించి చిన్న చిన్న పశువుల పాకలను ఏర్పాటు చేయగా అధికారులు తొలగించారు. ఎట్టకేలకు హౌసింగ్ బోర్డు ఖాళీ స్థలాలకు ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ఇంకా కొన్ని చోట్ల ప్రహరీ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

అక్రమ పద్ధతిలో..

కాముని చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో ఉన్న పలు పట్టా భూముల యజమానులు తమ భూములను చెరువు పరిధి నుంచి తప్పించేందుకు హౌసింగ్ బోర్డు భూముల్లోకి అక్రమంగా జరుగుతున్నారు. అంతే కాకుండా హౌసింగ్‌బోర్డు ఎలాంటి లే అవుట్ చేయని ఖాళీ స్థలాలను రోడ్డు స్థలాలుగా చూపుతూ జీహెచ్‌ఎంసీ నుంచి భవన నిర్మాణ అనుమతులు పొందుతున్నారు. ఇటీవల కాలంలో ఇక్కడి చెరువు పరిధిలోని ఓ ఖాళీ స్థలం యజమానులు తమ రాజకీయ పలుకుబడిని ఉపయోగించి హౌసింగ్ బోర్డు స్థలాన్ని రోడ్డు స్థలంగా చూపి భవన నిర్మాణ అనుమతులు పొందారు. దీనిని గుర్తించిన అధికారులు వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. మరో వైపు కైత్లాపూర్ గ్రామ పరిధిలో తమ ఆధీనంలో 10 నుంచి 30 ఎకరాల వరకు భూములు ఉన్నాయంటూ నమ్మబలుకుతూ రియల్ ఎస్టేట్ సంస్థలు, భవన నిర్మాణ రంగ సంస్థలు అమ్మకానికి పెట్టారు. ఓ బడా నిర్మాణ సంస్థ ప్రతినిధులు భూములను అమ్మకానికి పెడుతూ కొనుగోలు దారులకు చూపిస్తుండటం, వలలో పడిన వారి వద్ద నుంచి ఎంతో కొంత సొమ్ము చేసుకోవటం కొన్నేళ్లుగా జరుగుతున్నట్లు హౌసింగ్ బోర్డు అధికారులు సైతం పేర్కొంటున్నారు.

ప్రహరీ నిర్మాణానికి చర్యలు

హౌసింగ్ బోర్డు, దిల్ సంస్థలకు చెందిన ఖాళీ స్థలాల సంరక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే హౌసింగ్ బోర్డు భూములకు ఫెన్సింగ్, ప్రహరీ గోడల నిర్మాణం, బోర్డులను ఏర్పాటు చేశాము. దిల్ సంస్థకు చెందిన భూములకు కూడా ప్రహరీ నిర్మాణ పనుల కోసం టెండర్ ప్రక్రియ పూర్తి కావచ్చింది. కొందరు తప్పుడు పత్రాలను చూపుతూ హౌసింగ్ బోర్డుకు చెందిన భూములను అమ్ముతామని మార్కెట్‌లో తిరుగుతున్న విషయం తమ దృష్టికి కూడా వచ్చింది. వారి వలలో పడి మోసపోవద్దు. కూకట్‌పల్లి గ్రామంలోని మొత్తం భూముల్లో సుమారు 90 శాతం భూములు హౌసింగ్ బోర్డుకు చెందినవే.

– కిరణ్‌బాబు, వెస్ట్రన్ డివిజన్ ఈఈ

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిక



బీఆర్‌ఎస్‌లో చేరిన కార్యకర్తలతో ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం హైదర్‌నగర్‌కు చెందిన బాల్ రెడ్డి హనుమాన్ రెడ్డి ఆధ్వర్యంలో 50 మంది కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధిని, కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన సంవత్సర కాలంలో జరుగుతున్న విధ్వంసాన్ని గమనించామని చేరిన నాయకులు పేర్కొన్నారు. మళ్లీ అభివృద్ధికే పట్టం కట్టాలన్న ఉద్దేశంతో బీఆర్‌ఎస్‌లో చేరామన్నారు. పార్టీలో చేరిన వారిలో రాజేష్, నాగరాజు, నగేష్, రవీందర్, శ్రీనివాస్ రెడ్డి, దొరబాబు, రవళి, దుర్గా భవాని తదితరులు ఉన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన



హోమంలో పాల్గొన్న బండి రమేష్ తదితరులు

కూకట్‌పల్లి: కేపీహెచ్‌బీ కాలనీ ఆరవ ఫేజ్‌లో విజయదుర్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం పంచముఖ ఆంజనేయస్వామి, దక్షిణామూర్తి వారి దివ్య విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం పీఠాధిపతులు దుర్గా ప్రసాద్ సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ హాజరై హోమం, వివిధ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు విజయ్‌కుమార్‌చౌదరి, రామారావు, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, ప్రవీణ్ అప్పారావు, శివ చౌదరి, నలినికాంత్, రమణ, రజిత, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: నియోజకవర్గ పరిధిలోని పలువురు వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. 42 మంది బాధిత కుటుంబ సభ్యులకు రూ.16.16 లక్షల విలువ గల చెక్కులను బుధవారం ఎమ్మెల్యే కృష్ణారావు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందన్నారు.

మహిళలకు సన్మానం

కూకట్‌పల్లి: కూకట్‌పల్లిలోని శ్రీదుర్గా ఒకేషనల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పలువురు మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దుర్గారాణి, సూర్యప్రకాష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా దినోత్సవంలో పాల్గొన్న మహిళలు, నాయకులు

నూతన ఎమ్మెల్సీకి సన్మానం



ఆల్విన్‌కాలనీ: కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఎమ్మెల్సీగా విజయం సాధించిన సి. అంజిరెడ్డిని బుధవారం వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షులు డాక్టర్ యన్. వంశీరెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. క్యాక్రమంలో శ్రీహరి యాదవ్, రాజు, భాస్కర్‌రెడ్డి, తిమ్మయ్య, లక్ష్మణ్, మల్లికార్జున్ రెడ్డి, జయశ్రీ, రేణుక పాల్గొన్నారు.

16న 5కే రన్



ఆహ్వానం అందజేస్తున్న శిరీష సత్తూర్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ తులసి వనంలోని అవని ట్రస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్చి 16న ఉదయం 6 గంటలకు 5కే రన్ నిర్వహించనున్నట్లు ట్రస్ట్ చైర్మన్ శిరీష సత్తూర్ తెలిపారు. బుధవారం కాంగ్రెస్ శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్ గౌడ్, హఫీజ్‌పేట్ కార్పొరేటర్ పూజిత గౌడ్‌లను ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 5కే రన్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

హెల్పింగ్ హ్యూమన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇఫ్తార్

కూకట్‌పల్లి: రంజాన్ మాసంలో ఉపవాస దీక్ష చేస్తున్న ముస్లింలకు హెల్పింగ్ హ్యూమన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి రోజు సాహెర్, ఇఫ్తార్‌ను అందజేస్తున్నట్లు సంస్థ చైర్మన్ షేక్ మహ్మద్ మక్బూల్ తెలిపారు. బుధవారం భరత్‌నగర్ కాలనీలోని మజీద్ ఈ ఫాతిమా మజీదులో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఖలీల్, సయ్యద్ మాజర్, ముస్లింలు పాల్గొన్నారు.



సాహెర్ చేస్తున్న ముస్లింలు

అడ్రస్ అడిగి.. నీళ్లు కావాలని..

బంగారు గొలుసు అపహరణ

కేపీహెచ్‌బీకాలనీ: ఇంటి ముందు వాకిలిలో ముగ్గు వేస్తున్న ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. ఉదయం కేపీహెచ్‌బీ కాలనీ ఈడబ్ల్యూఎస్ గృహం వద్ద నివాసం ఉండే అంజలి ఉదయాన్నే ఇంటి ముందు వాకిలి ఊడ్చి ముగ్గు వేస్తోంది. అదే సమయంలో అటువైపుగా వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి అంజలిని అడ్రస్ అడిగాడు. అనంతరం తాగేందుకు మంచినీళ్లు కావాలని అడిగాడు. దీంతో అంజలి నీళ్లు తెచ్చేందుకు ఇంట్లోకి వెళ్లగా.. వెనుకనే వెళ్లి ఆమె మెడలోని 24 గ్రాముల బంగారు గొలుసును తెంచుకొని పారిపోయాడు. వెంటనే అంజలి అరుస్తూ అతడి వెనుక పరుగెత్తినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చేపట్టారు.

జేఎన్‌టీయూహెచ్‌లో బ్రెస్ట్ కేన్సర్‌పై వర్క్‌షాప్



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ రఘురామ్, యూనివర్సిటీ రెక్టార్ విజయకుమార్ రెడ్డి

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూహెచ్ సహకారంతో గ్లోబల్ లీడర్‌షిప్ అవుట్‌రీచ్ అండ్ వెల్‌బీయింగ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బ్రెస్ట్ కేన్సర్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. జేఎన్‌టీయూహెచ్ అడ్మిషన్ బిల్డింగ్‌లోని గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో నిర్వహించిన ఈ వర్క్‌షాపులో డాక్టర్ రఘురామ్ పాల్గొని బ్రెస్ట్ కేన్సర్‌ను త్వరగా గుర్తించడం ఎంత ముఖ్యమో వివరించారు. 40 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళ సంవత్సరానికి ఒకసారి స్క్రీనింగ్ మ్యామోగ్రామ్ చేయించుకోవాలని సూచించారు. 'ఏబీసీ ఆఫ్ బ్రెస్ట్ క్యాన్సర్ ఆర్ బ్రెస్ట్ హెల్త్' మొబైల్ యాప్ గురించి ఆయన వివరించారు. ఈ యాప్ 11 భారతీయ భాషల్లో బ్రెస్ట్ హెల్త్ సంబంధిత ముఖ్యమైన సమాచారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో పద్మశ్రీ డాక్టర్ బి.సి. రాయ్, యూనివర్సిటీ రెక్టార్ డాక్టర్ విజయకుమార్ రెడ్డి, డాక్టర్ టి. మాధవి కుమారి తదితరులు పాల్గొన్నారు.

మీడియేషన్ సెంటర్ ద్వారా కేసులు పరిష్కరించుకోవాలి



మీడియేషన్ సెంటర్‌ను ప్రారంభించిన జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి పంచాక్షరి తదితరులు

మోతీనగర్: డబ్బులు, సమయం వృథా చేసుకోకుండా కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చని రంగారెడ్డి జిల్లా సెషన్ కోర్టు జడ్జి సీహెచ్ పంచాక్షరి అన్నారు. కూకట్‌పల్లి మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో సేవా భారతి చారిటుబుల్ ట్రస్ట్ సీనియర్ సిటిజన్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఓసీ, బీసీ, మైనార్టీ కమిటీ మీడియేషన్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. స్టేట్ లీగల్ సెల్ అథారిటీ సర్వీసెస్ ఆధ్వర్యంలో మీడియేషన్ సెంటర్ కొనసాగుతుందని తెలిపారు. చిన్న చిన్న లావాదేవీలు కోర్టు వరకు వెళ్లకుండా మధ్యవర్తిత్వంతోనే పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జి. కళార్చన, జడ్జి ఆవేద్ పాషా, రంగారెడ్డి జడ్జి శ్రీదేవి, మీడియేషన్ సెంటర్ ట్రైలర్లు సరోజా, భాస్కర్, సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పి. సీతారామయ్య, వైస్ చైర్మన్ బైరెడ్డి, ట్రస్టీలు ఉమామహేశ్వరరావు, నాగేశ్వరరావు, రవీంద్రనాథ్ ఠాగూర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి



కార్పొరేటర్‌తో పాస్టర్లు

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లోని క్రైస్తవుల శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి చేస్తానని కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. శ్మశాన వాటికకు రూ. 20 లక్షల నిధులు మంజూరు కావడంతో పాస్టర్లు ఆయనను బుధవారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కృష్ణారావు సహకారంతో నిధులు మంజూరయ్యాయని తెలిపారు. పనులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో క్రైస్తవ శ్మశాన వాటిక అధ్యక్షుడు డాక్టర్ అందె సుధాకర్, పాస్టర్లు జాన్ విక్టర్ సేలం, డి సుధాకర్, శాంతి రత్నరాజు, కె. పీటర్, ఎం దాస్, అనిల్‌కుమార్, కరుణాకర్, కవిత, జయరాజ్, విల్సన్, స్టివెన్, దేవ సాయం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించే డిజిటల్ లిటరసీ ప్రోగ్రాం

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ కాలనీలో సీనియర్ సిటిజన్స్ సంఘాల సమాఖ్య కూకట్‌పల్లి చాప్టర్, హెల్ప్‌ఏజ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం డిజిటల్ లిటరసీ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హెల్ప్‌ఏజ్ ఇండియా తెలంగాణ, ఆంధ్ర కోఆర్డినేటర్ పులి శ్యామ్ హాజరై సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సీనియర్ సిటిజన్స్ సైబర్ నేరాల భారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, శర్మ, వేదమూర్తి, పుల్లారెడ్డి, దుర్గా రాణి తదితరులు పాల్గొన్నారు.

శివాభిషేకం

కూకట్‌పల్లి: గాంధీనగర్‌లోని రామలింగేశ్వర, ఆంజనేయ స్వామి ఆలయంలో పాదరక్షలతో ఆలయంలోకి ప్రవేశించి చోరీ ఘటన జరిగింది. దీంతో బీజేపీ కూకట్‌పల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు ఆధ్వర్యంలో బుధవారం పూజలు నిర్వహించి ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డితో కలిసి శివాభిషేకం చేశారు.

సమస్యలు పరిష్కరించాలని డీసీకి వినతి



మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ వివేకానందనగర్‌లో రోడ్డు నంబర్ 8 నుంచి 11 వరకు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎంపీ ఈటల రాజేందర్‌ను బీజేపీ నాయకులు కోరారు. దీంతో ఆయన సిఫార్సు లేఖను బీజేపీ నాయకులకు అందజేశారు. ఈ మేరకు బుధవారం ఆ లేఖను జీహెచ్ఎంసీ మూసాపేట డీసీ వంశీకి బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి పులివెందుల శ్రీనివాస్ యాదవ్ నాయకులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు విజయ్‌కుమార్, నాయకులు రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గాయత్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన కృష్ణారావు ప్యానల్ సభ్యులు

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికల నామినేషన్ పర్వం బుధవారం ముగిసింది. ఒక్కరే నామినేషన్ వేయడంతో వి. కృష్ణారావు ప్యానల్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు సూరిబాబు, టీవీఎస్‌రాజు, ఆకుతోట విఠలయ్య తెలిపారు. అధ్యక్షుడిగా వి. కృష్ణారావు, ఉపాధ్యక్షుడిగా కె. ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా జి. వెంకటరమణ, కార్యదర్శిగా జి. విష్ణువర్ధన్ రెడ్డి, కోశాధికారిగా బి. శ్రీలత ఎన్నికయ్యారు. అందరి సహకారంతో కాలనీని అభివృద్ధి చేస్తానని వారు తెలిపారు.